అభినవసరస్వతి

యను నొక మాసపత్రిక.

నాగరఖండ స్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు

జానపాటి పట్టాభిరామశాస్త్రిచేఁ

ప్రచురింపఁబడుచున్నది.

జానపాడు.

సంపుటము 21 { 1929 సం॥ జూలై నెల } సంచిక 4

విషయములు.

చందానిర్ణయము సంవత్సరమునకు

ప్రధానపోషకులకు రు 25 0 0 సహాయులకు రు 5 0 0

పోషకులకు రు 10 0 0 చందాదారులకు 3 0 0

Printed at the Chandrika Press, Guntur,
and published at Janapadu by the Editor, Astavadhani
Janapati Pattabhirama Sastry,
author of Nagarakhandam, Swarnakaravyavaharam
etc., etc.

ప్రధానపోషకులు.

౧ శ్రీ శ్రీ జగద్గురు విరూపాక్ష స్వాములవారు, రఘుపతిపేట.
౨ శ్రీ శ్రీ జగద్గురు పుష్పగిరి స్వాములవారు, కమలాపురం.
౩ బాకరాజు పరాంకుశరావుదేశాయిగారు. యాడవరం.
౪ రామసింగుగారు - నెల్లుట్ల.
౫ ఇనిగెల వెంకటధర్మారెడ్డి సర్దేశముఖుగారు - ఆత్మకూరు

పోషకులు.

౧ రాజా వెంకటాద్ర్యప్పారావు, బహదరు జమీందారుగారు-నూజవీడు.
౨ గూడూరి వీరసాంబశివరావు సర్దేశపాండ్యాగారు, మానెకొండూరు
౩ జాగర్లమూడి కుప్పుస్వామినాయఁడుగారు, కారంచేడు
౪ నెల్లుట్ల నరసింహారావుగారు, జనగాం
౫ లింగాల వెంకటరెడ్డి దేశముఖుగారు, కుందవరము
౬ రంగాచార్యులుగారు, ముక్త్యారు, దేశముఖు, మసీదుపల్లె.
౭ చారబుడ్డి రత్నారెడ్డిపటేలుగారు, న్యాలపోగుల
౮ రామయాంబికా పుస్తకభాండాగారము, లక్ష్మీనర్సాపురము.
౯ తంగెడ నరసింహారావుగారు, కరణం, మోర్జంపాడు.
౧౦ టి. లక్ష్మణసింగుగారు, జనగాం
౧౧ రాజా మంత్రిప్రగడ వెంకటహనుమంతరావు, రాఘవరావుగార్లు, లింగగిరి.
౧౨ పిశుపాటి వెంకటరాయశర్మగారు, కరవది
౧౩ శ్రీ శ్రీ జగద్గురు అభినవ విరూపాక్ష పీఠాధిపతులు, కాకినాడ.
౧౪ శ్యామాపంతుల వెంకటేశ్వరరావుగారు, తహశీల్దారు, ఆరుమూరు.
౧౫ కొత్వాలి వెంకటేశ్వరరావుగారు, సంగెం
౧౬ లింగాల రంగారెడ్డి దేశముఖుగారు, గణపురం,
౧౭ రాజా కందుకూరు సూర్యప్రకాశరావు బహద్దరు, జమీందారుగారు-దేవిడి.
౧౮ సాకుంట కిషన్‌రావు దేశముఖ్ గారు, జగిత్యాల.
౧౯ శ్రీమద్వెంకట శేషారెడ్డి రామచంద్రారెడ్డి దేశముఖుగార్లు, అల్లాదుర్గసంస్థానము.
౨౦ కురికాల వెంకటేశ్వరరావుగారు.
౨౧ మండ చినవెంకయ్యగారు, దండమూడి.

సహాయులు

౧ కాకుమాను హనుమయ్యగారు, నర్సారావుపేట
౨ మెదక్ కిషన్‌రావు దేశముఖుగారు, నల్లపల్లి
౩ బీరకాయల హనుమంతరావు దేశపాండ్యాగారు, రాయగిరి
౪ లక్ష్మీనరసింహస్వామివారు, యాదగిరి
౫ నెల్లుట్ల కేశవరావు దేశముఖుగారు, షాపురం.
౬ వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు, చెన్నపట్టణము.
౭ పెద్దిభట్ల వీరయ్యగారు, ప్లీడరు బెజవాడ
౮ తిప్పరాజు కామేశ్వరరావుగారు, కరణం, దుగ్గిరాల

అభినవ సరస్వతి.

సంపుటము ౨౧ { జానపాడు శుక్ల సం॥ ఆషాఢమాసము. } సంచిక ౪

కాంగ్రెసు—మతము.

గ్రామపరిపాలకసంఘములు (మునిసిపాలిటీలు), శాసన నిర్మాణసభలు (లెజిస్లేటివు కౌన్సిల్సు) మున్నగువానియందు జాతీయ మహాసభకు (కాంగ్రెసుకు) సంబంధించిన వారినిమాత్రమే సభ్యులఁ గాఁబ్రజలు వరింపవలెనని జాతీయమహాసభవారు ఘోషించుచున్నారు.

ఇది సరికాదు. జాతీయమహాసభయు దాని యుపసభలును మనమతమున కింతవఱకు నేవిధమున నుపకరించినవి? ఏమి ఘన కార్యముఁ జేసితిమని జాతీయమహాసభానాయకులు దొరతనమువారి సభలందును దమ్ము నాయకులనుగా స్వీకరింపవలెనని ప్రజలను గోరు చున్నారు? నాస్తికుల నాయకత్వమున జాతీయమహాసభ నేఁడు మన సంఘమునకుఁ జేసిన హాని నేరామమోహనరాయల నాయకత్వము నను బ్రహ్మసమాజము చేసియుండలేదు; ఏదయానందుల యాధి పత్యమునను నార్యసమాజ మొనరించియుండలేదు; ఇఁక నేముసల్మా నుల సంఘమును నేక్రైస్తవుల సమాజమును జేసియుండలేదని చెప్ప నక్కఱలేదుగదా. ఈ యభినవజాతీయ నిరఙ్కుశ ప్రభువుల చేతికిఁ గూడ జుట్టునిచ్చి గంతులు వేయవలసినదా? ఔచిత్య మించుక యైనను లేని నాస్తికులు పెక్కండ్రు జాత్యభిమానము నభినయించియు, మతావేశమును బ్రదర్శించియు, సనాతనమతస్థుల హృదయమును ద్రవ్యమును హరించి, క్రమముగా బలవంతులై, పూర్వము తమ సభకు నాయకులయినవారికే స్థానభ్రంశముఁ గలిగించినారు. పూర్వ

నాయకు లందఱును నాస్తిక్యము లేనివారని నేను నుడువను. కాని, వార లభినవనాయకులకంటె నౌచిత్యవిచారమందు వేయిమడుంగులు గొప్పవారని మాత్రము పల్కుచున్నాఁడను. కాఁబట్టియే వారు రాజకీయ సభలందు మతవిషయములను జొప్పించుటకుఁ బ్రయత్నింపలేదు. రాజకీయ విషయముమాత్రమే చర్చించుటకేర్పడిన జాతీయ మహాసభ (కాంగ్రెసు) యిప్పు డొక గొప్ప సంఘసంస్కరణ సభగా నెట్లు పరిణమించి దేశమున నొక పెనుభూతమై ప్రజలను బీడించుచున్నదో ప్రత్యక్షమే. ఇంచుకయైన వివేకముగల సనాతన మతాభిమాను లీ విపరీత భూతమునకు బలియై పోవుట కిష్టపడఁగలరా? ఇయ్యది స్త్రీపురుషులకు జన్యజనకులకు సేవ్యసేవకులకును భేదంబులుప్పతిలఁ జేసి సంఘమునందు విప్లవము నొదవించుచున్నది; సకల జాతులను సంకరముఁ జేయనెంచినది; ప్రాచీన మతాచార్యులను సైతానులని తిట్టుచున్నది; దురాచారముల నెలకొల్పుచున్నది; దుర్జనులఁ బ్రతిష్ఠించుచున్నది. ఇట్టి మహాభూతముయొక్క వక్త్రకుహరమునందా ప్రజలు ప్రవేశింప వలసినది? ఇట్టి యసభ్యసభ్యులనా నాయకులనుగా గ్రహింపవలసినది?

కొన్ని రాజకీయవిషయములందు నాస్తికులు తమలోఁ దాము పోరాడుచున్నను, వర్ణసాంకర్యాదివిషయములం దీజాతీయసభ్యు లందఱు నేకగ్రీవముగా నాడువారె; పనిఁ జేయువారె. నిర్మాణకార్యక్రమము (కన్‌స్ట్రక్టివ్ ప్రోగ్రేమ్) అను నామమునఁ బరగుచున్న వీరి విధ్వంసనకార్యక్రమమునం దభిప్రాయభేదము కనఁబడదు. వీరు గ్రామసంఘములు శాసనసభలు స్థానికసభలును మంచిమాటలచే నాక్రమించి ప్రజాప్రతినిధిపదప్రాప్తివలన బలము సంపాదించి జనుల యుల్లములందు స్వరాజ్యాభాసవ్యామోహ ముద్భవింపఁజేసి సంఘమును జీకాకు చేయుచున్నారు. వీరి స్వరాజ్యమెట్టిదో లక్షణములు

చూపట్టుచునేయున్నవి! ఇట్టి నాయకోత్తములచే నాక్రమింపఁబడిన తరువాతఁ బట్టణసభలు (మునిసిపాలిటీలు) మున్నగువాని పరిపాలన మెంతసౌభాగ్యముతో నున్నదో చూడుఁడు! దేశ మరాజక మగుచుం డలేదా? ఇట్టివారివశము కానప్పుడు పాలన మెవ్విధముననుండెడిదో స్మరింపుఁడు! అప్పు డిన్నివిభేదములును, కలహములును, వ్యవహార లోపములు, నుండెడివా?

భారతదేశస్థు లెవ్వరును స్వపరిపాలన కర్హులుకారని నాయా శయము కాదు. మఱియేమన, నీసమయమున జాతీయమహాసభాదు లకు నాయకులుగా నెగిరిపడుచున్నవారిలో నొకఁడయినను బట్టణాదు లను బరిపాలించుట కెంతమాత్రము సమర్థుఁడు కానేరఁడని నాయభి ప్రాయము. వీరు తమ జాతీయసభాదుల నెంతమనోహరముగా నడు పుచున్నారో చూచి యానందింపవలసిన విషయము! పిల్లి తన కూనల నేడిండ్లకుఁ ద్రిప్పునను సామెతచొప్పున వీరు తమ సభల నొక సారి దేహళీపురమునందు, నొకపరిఁ గాకాసుర పట్టణమునందు, నొక పర్యాయము శబరాశ్రమమునందును జరుపుచు, నిఁక మాలో మాకుఁ గల వివాదలన్నియు నుపశమించినవని ఘోషించుచు, గృహాభిముఖు లయినతోడనే తమ తీర్పులను (రిసల్యూషన్సు) దామే తిరస్కరించి, కయ్యమునకుఁ గాలుఁద్రవ్వుచున్నారు.

వీరు సత్యసంధులయినచో, నిన్నిపర్యాయములు స్వకృతము లైన సంధిబంధముల నేల త్రుంచివేయుచున్నారు? అపరగాంధియని పేరువడసిన రాజగోపాలాచార్యులయ్యవార్లంగారు కాకాసురనగర మున జరిగిన జాతీయమహాసభయందు జంబుకేశ్వరవినయముతో రెండు కక్ష్యలకు నొడంబడికనుకూర్చి యొకతీర్పు (Compromise resolution) నుపపాదించి, తరువాత గాంధి గురుపీఠసన్నిధిని శబర్మతీనదీ తీరమునఁగూడిన మఱియొక సభయందు "ధర్మమునకు నధర్మము

నకును సంధియెట్లు ? " అను సూత్రము ననుసరించి, కాకపురమునఁ దముచేఁ గావింపఁబడిన తీర్పునే సున్నచేయుటకుఁ బ్రయత్నించిన మహానుభావులు. శాసనసభలకుఁ బోవలయునను వారికిని (Pro-Changers) శాసనసభలకుఁ బోవలదను వారికిని (No-Changers) సంధి పెక్కుతావులఁ గూర్పఁబడియున్నను పోరాటములు మాత్రము యథాప్రకారముగానుండుటకుఁ గారణమేమి ? ఇట్టి సత్యసంధులా దేశమును పాలింపఁగలవారు ? మతమును సంస్కరింపఁగలవారు ?

మఱియు, వీరివ్యవహారదక్షత నేమని వర్ణింపఁగలము ? వీరి సొమ్ములుఁ బద్దులు సుద్దులును ముద్దులొల్కునవి. మధ్యాహ్నమున సైకతస్థలిని జీవన్ముక్తుల యుపదేశ భాగ్యమని ప్రకటింపఁబడును. రాత్రిఁ బదిగంటల కాలమయినది. అయినను మన శుద్ధబుద్ధస్వరూపుల దర్శన సుఖము మాత్రము శశవిషాణమగుచున్నది. జాతీయనాయకుల రాజకీయచర్యలను విమర్శించుటను మాని యీపత్రికయందుఁ గొన్ని మతచేష్టలను మాత్రమే చూపుచున్నాఁడను.

సనాతనమతాభిమానులు జాతీయమహాసభయందుఁ బ్రవేశించి వాదించి జయమొందవలెనుగాని సభను విడిచిపెట్టి పోఁగూడదని పల్కుజాతీయవాదులు దొరతనమువారి శాసననిర్మాణసభలందేల ప్రవేశింపఁగూడదు, మంత్రిపదవుల* నేల స్వీకరింపరాదు ? అవి బహిష్కరించినఁగాని దొరతనమువారి వైఖరి మాఱదందురేని, బహిష్కరించినఁగాని జాతీయమహాసభకును బుద్ధిరాదని యుత్తరము. దొరతనమువారి సభలందు జాతీయవాదులమాట చెల్లదనియు గౌరవమునకు భంగముకలుగుననియు సందువలన నచ్చట నుండఁ గూడదనియుఁ బల్కెదరేని జాతీయవాదులసభలందు శిష్టులమాట చెల్లదనియు గౌరవము తక్కుదనియు సమాధానము. తొండ ముదిరి యూసరవిల్లి యైనచందమున జాతీయసభ స్వరాజ్యపక్షముగా మాఱి

నదనియు, స్వరాజ్యపక్షసూత్రము ననుసరించి శాసనసభలలోఁ బ్రవే శింపవచ్చుననియు వాదించు నెడల, మంత్రిపదవుల నేల స్వీకరింపఁగూడదని వీరిని బ్రశ్నించుచున్నాఁడను. స్వీకరింపఁగూడదనుటకు వీ రే హేతువులను దెల్పెదరో, యా హేతువుల చేతనే జాతీయసభయందు సభ్యులుగా సనాతనమతాభిమానులు కూర్చుండవలదని నేను వక్కాణించుచున్నాఁడను.

జాతీయవాదు లహింసావ్రతము నవలంబించిన పుణ్యపురుషు లనియుఁ గావున వారి సభలందుఁ బ్రవేశించుటవలన హాని యుండ దనియుఁ జెప్పెదరేమో. పురుషవృషభులుగావుననే పౌరుషమును వృషభత్వమును బ్రదర్శించి మాటిమాటికిని వీరు కలహమునకుఁ గాలుఁ ద్రవ్వుచుందురు. దొరతనమువారి ముందర వీరి పౌరుషమును వృషభత్వమును నిలువఁజాలవని వీరు దొరతనమువారి యెడల మాత్ర మహింసావ్రతమును బ్రకటించుచున్నారు. సమయము చిక్కినప్పుడుఁ గొంద ఱొకతన్నుఁదన్నుచునే యున్నారు. సాధువులవిషయ మందో — అచ్చట నవశ్యము హింసావ్రతమే సాగుచున్నది. జాతీయ వాదులలోను గొందఱు కపటనాటకసూత్రధారులు. వారు "అతి వినయము ధూర్తుని లక్షణము" అను వాక్యమునుబట్టి వినయము నభినయించి, మునివేషములఁదాల్చి, సంచరించుచున్నారు. మఱికొందఱు సమయమున నుసరించి తమ నిజస్వరూపముల నించుక చూపుచుందురు. గాంధిగా రహింసను బల్కుచుండ, స్వరాజ్యపక్షనాయకు లగు మోతీలాలు నెహ్రూగారు శక్తిలేకపోవుటచేతనే దొరతనము వారి యెడల హింస ప్రయోగింపఁబడుట లేదనియు, శక్తి కల్గెనేని హింసయే యవలంబింపఁబడియుండుననియు, వచించియున్నారు. మాయగా మాట్లాడువారికంటె ధారాళముగా మాట్లాడువారే శ్లాఘింపఁదగియుందురు. "ఊరకొనక యురిపెట్టుకొనెదవా యేమి" అను మాటచొప్పునను,

శ్లో॥ "శాంతి రలభ్యా దుపరతి। రపాత్ర భావః ప్రతిగ్రహానివృత్తిః।
క్షాంతి ర్దుర్బలతేతిచ। నివృత్తిధర్మాః కలౌ వే తే॥ "

అను నప్పయదీక్షితుల వైరాగ్యశతకములోని పద్యమునఁ దెల్పఁ బడినరీతిగాను, గోరఁబడినవస్తువు లభ్యము కాకపోవుటచేఁ దన్నిమిత్తమై ప్రయత్నమునుండి విరమించుటయే శాంతి; సంకరభోజనాదులవల్ల నపాత్రులగుటయే యప్రతిగ్రహావ్రతము; శత్రువుల నేమియుఁ జేయఁజాలక చచ్చినట్లు పడియుండుటయే యోరిమి! ఇటుల నీకలియుగమున నియ్యవియే నివృత్తిధర్మములయి యొప్పుచుండును. కాఁబట్టి మన యభినవబుద్ధుల యహింసావ్రతమునకుఁ గేవలము దుర్బలత్వమే కారణమని స్పష్టమగుచున్నది. వీరును వీరి దాసానుదాసులును నిజముగా సహనభావము గలవారయినచో, బిపినచంద్రపాలుఁ డాహ్వానము నంగీకరించి యొక సాయంకాలమున విందునకు రాఁగా, వెంటనే దీపము లార్పివేసి గోలఁజేయుచు నతనిపైఁ బడుట కీశాంతమూర్తులు ప్రయత్నించి యుండరుగదా. జిన్నాయను నతఁడు జాతీయ మహాసభయందు మహాత్మా గాంధీయని ప్రయోగింపక గాంధిగారు (మిస్టరుగాంధి) అని మాత్రమే ప్రయోగింపఁగా, మిన్నుముట్టులాగునఁ గేకలు వేయుచు, మహాత్ముఁడని యుచ్చరించువఱకు మాట్లాడుట కవకాశము నిచ్చువారము కామని ప్రేలుచు, నీశాంతస్వరూపులు ముష్కరత్వముఁజూపియుండరు. అతఁడుకూడఁ బ్రఖ్యాతనాయకులలో నొక్కఁడే గావున "నేను మహాత్ముఁడని పిలువను" అని చెప్పినను విశేషబాధ కలుగకుండ నెటులనో తన యుపన్యాసమును ముగింపఁగల్గెను. ఇఁక సామాన్యులమాట యెట్లుండునో యూహింపుఁడు. వంగరాష్ట్రీయసభయందు నొకవక్త కిట్టి సత్కారమే జరిగెను. దొరతనమువారి శాసననిర్మాణ సభయందుఁగూడ నొక సభ్యుఁడు మహాత్ముఁడనుపదము నుపయోగింపక "గాంధీజీ" అని

ప్రయోగింపఁగాఁ గొందఱు గౌరవనిధులగు (ఆనరబిల్) సభ్యులు లేచి "మహాత్ముఁడని పల్కుము! మహాత్ముఁడని పల్కుము!" అని ఘోషింప నారంభించిరి; ఆతఁడు మహాత్ముఁడని యుచ్చరించుట కిష్ట పడలేదు; సభ్యులు నతని మాటాడనీయలేదు; ఆతఁడు క్రిందికి దిగి యెటులనో యపాయములేకుండ వెలుపలికిఁ బోవఁగల్గెను. స్వల్ప విషయమందే సత్యాగ్రహాపిృయు లిట్టి యాగ్రహము వహించుచుండ, గొప్ప సిద్ధాంతముల విషయమున నెట్టి సంఘర్షణ కలుగునో విచా రింపుఁడు. మఱియు జాతీయవాదులు పునహానగరమందలి యొక సభ యందును, గొన్ని యితరస్థలములందలిసభలయందును, బరస్పరదూష ణోక్తులతోఁ దనివినందక దండప్రయోగమునకుఁ గడంగి, తమలో నొకరో యిద్దరో స్మృతి తప్పి పడిపోవువఱకును గొట్టుకొని, రక్షక భటుల (పోలీసువారి) చే బాహ్యప్రదేశమునకుఁ దరిమివేయఁబడిన వారయిరి. ఆనిబెసాంటుగారు లోకపర్యాయము బొంబాయినగరమున నుపన్యసించుచుండ మన యహింసాధనులామెను బరిహసించుటకుఁ బ్రారంభించి యొక్కమాటనయినను బలుకకుండఁజేసి సభ ముగియు నట్లొనరించిరి. శ్రీనివాసశాస్త్రిగారను నుఱియొకరికి నిట్టి గౌరవమే కలుగుచువచ్చెను. ఇట్టి యుదాహరణము లెన్నోకలవని ప్రజలు తమ యనుభవమువలనఁ దెలుపఁగలరు. మన యపూర్వ జాతీయవాదులు శాంతహృదయులైనచో, నభిప్రాయభేదము లున్నమాత్రమున నీరీతి గాఁ బ్రవర్తించి యుండరు.

ఆక్షేపము:— సనాతనమతస్థులు తమ యాశయములను స్పష్టముగా జాతీయ నాయకులకు నివేదించినయెడల వారు వినెదరు. అట్లు నివేదించకుండ వారిని నిందించుట తప్పు.

సమాధానము:—వారెట్లువినెదరు? వినునవస్థలో నున్నారా? వినునంత సరసులా? ఇట్టివారిని వినుఁడని ప్రార్థించుటయు బుద్ధిహీన మయినకర్మ. ఏలయన,

శ్లో॥ "ప్రాయః ప్రకుప్యతి తరాం ప్రీత్యైవచ ఖలో జనః।
నయనం స్నేహసంపర్కా త్కాలుష్యం సముపైత్యలం॥"

(నూనె తగిలినకన్ను మిక్కిలి కలుషమగును. అప్పుడు మునుపటి కంటెను వస్తువులను స్పష్టముగాఁ జూడఁజాలదు. అటులనే స్నేహముఁజూపినకొలఁది, బ్రీతిమాలినకొలఁది, దుర్జనుఁడు ప్రసన్నుఁడగుటకు మాఱుగా నుగ్రుఁడగుచుండును. అను శ్లోకమునందు సూచింపఁబడిన ప్రకృతి కనునయము పనికిరాదు. ప్రజలు నాస్తికనాయకులను గౌరవించుటచేతను, యాచించుటచేతను, దాము మహాత్ములమను దురభిమానము వృద్ధినొందును గాన వారు సాధుజనులను బాధించుటకు మఱియుఁ బ్రయత్నించెదరు. అహమ్మదాబాదునందు శారదాపీఠ (శంకరాచార్యపీఠ) స్వాములవారను నొకరు జాతీయమహాసభకు నస్పృశ్యతాదిమతవిషయములను జర్చించు నధికారము లేదని మందలించినను, నిరంకుశనాయకు లిట్టిమాట లక్ష్యపెట్టక వ్యతిరేకముగాఁ దీర్పుఁజేసిరి. ఈస్వాములవారును నాయకులుగా స్వీకరింపఁబడినవారే; కారాగారశిక్షకును సిద్ధపడినవారే. అయినను వారి పల్కునకు విలువలేకపోయినది. ఇఁకఁ గేవలము ననామకులుగా నెన్నఁబడుచున్న సనాతనమతస్థుల మొఱలను వినువారెవ్వరు? అస్పృశ్యతాది విషయములందు శాస్త్ర మేమిచెప్పుచున్నదియు నీనాస్తిక శిఖామణులకుమాత్రము తెలియదా? ఎఱింగియు మొండితనము వహించి వీరు ప్రజలకు మోసమొనరింపవలెనను నుద్దేశముతో వ్యవహరించుచు, నస్పృశ్యత్వాదులు శాస్త్రసిద్ధములు కావని బొంకుచున్నారు. అస్పృశ్యతాసిద్ధాంతము మంచిదికానిండు, చెడ్డదికానిండు. అది శాస్త్రమున లేదనుటమాత్రము మోసముఁజేయుట. శాస్త్రమున నున్నను మాకది యిష్టముకాదుగాన నుపేక్షింపఁదగినదని చెప్పుట ధారాళహృదయుల లక్షణము. అట్లుగాక తమ కిష్టముకానివన్నియు

శాస్త్రముచే నిషేధింపఁబడినవని బోధించు నభినవనాయకులతో వాదప్రతివాదములు సల్పుటవలన నేమి ప్రయోజనము ?

ఇప్పుడు జాతీయసభను (కాంగ్రెసును) నడుపుచున్న ఘనులు జిగీషతోఁగూడినవారే! కాని జిజ్ఞాసతోఁగూడినవారు కారు. వారికి సత్య మక్కఱలేదు ; ధర్మ మవసరములేదు. వారికిఁ గావలసినది ప్రజల నెట్లాయిన నడఁగఁద్రొక్కి నిరంకుశాధికారమును సాగించుట యే. ఇట్టివారితో వాదముచేయుట కంఠశోషయే యగును. కాఁబట్టియే యనుభవముగలపెద్దలు —

శ్లో॥ "ఖలానాం కంటకానాంచ ద్వివిధైవ ప్రతిక్రియా
ఉపానన్ముఖభంగోవా దూరతోవా విసర్జనం॥"

(దుష్టులకును ముళ్ళకును జేయవలసిన చికిత్స రెండువిధములుగా నున్నది. పాదరక్షతో ముఖమర్దనముఁగావించుటయొకటి. దూరముగా విసర్జించి పోవుట రెండవది.) అని నుడివియున్నారు.

సనాతనమతాభిమాను లీరెండువిధములలో రెండవది ప్రయోగించి చూడనగు; జాతీయవాదుల నుపేక్షింపవలెను ; జాతీయసభను బహిష్కరింపవలెను.

ఆక్షేపము :– ఇప్పటి జాతీయసభయందలి సభ్యులు దుష్టులయినచో వారినిమాత్రమే పరిత్యజింపవచ్చును. కాని, సభపైఁ గోపమువహించుట తప్పు. కావునఁ బూర్వాచారపరాయణులును సభలోఁ జేరవలెను.

సమాధానము :– సభ యనఁగా నేమి ? సభ్యసముదాయమే కదా, సభ్యులతో సంబంధములేక సభయనున దెచ్చటనో వ్రేలాడునదికాదు. సభ్యులు దురాత్ములయినప్పు డాసభయు నట్టిదేయగును. కావున నీ యసభ్యసభ్యులతోడి సంబంధమును విసర్జింపవలసినవార

లీయసభ్యసభను విసర్జింపవలసియుండును. ఇప్పటిస్థితి మాఱిననాఁడు మనము ప్రవేశము మాటఁజింతింపవచ్చును; అంతవఱకునుగాదు. అప్పుడయినను నిట్టిసభల యావశ్యకతను గూర్చి యాలోచింపవలసియుండు. అభిప్రాయభేద మున్నమాత్రమున గొల్లునగోలవెట్టి పరిహసించుట వలన నిది యుండఁదగిన స్థలముకాదని భావించి, ఆనీబెసాంటుగారు కొంతకాలము వఱకు జాతీయమహాసభను (కాంగ్రెసును) విసర్జించి దూరముగానుండి, బాహ్యముగా నామె యభిప్రాయమును దేశమునఁ జాటుచుండెను. కాని, కొంతకాలమునకు నాయకుల పాక మించుక సౌమ్యమయినట్లు కనుపడినతోడనే యామె మరల నాసభను బ్రవేశించెను; ఆమె సభాస్థలిఁ బ్రవేశించునపుడు సభాధ్యక్షులగు గాంధిగారును దదితరనాయకులును లేచి ప్రత్యుత్థాన మొనరించి యామెను గౌరవించిరి. అటులనే సనాతనమతాభిమాను లిప్పుడు జాతీయమహాసభకు వ్యతిరేకముగాఁ దీవ్రమయిన ప్రచార మొనరించి జాతీయసభను క్షీణింపఁజేయవలయును. అది క్షీణించిననాఁడు నాయకులకుఁ బశ్చాత్తాపము కలుగునేమో; కలిగినప్పుడు, సంధి కుదురవచ్చును. ఇప్పుడన్ననో, ప్రతిఘటనమే మార్గము. ప్రజలిచ్చు నుపహారములచేఁ గ్రొవ్వి ప్రజల యభిప్రాయములను దృణీకరించి వారలను బాధింపసాగిన జాతీయమహాసభకు మతాభిమాను లిఁక నెట్టిదానమును జేయఁగూడదు. వారి నేగ్రామసంఘమునందును సభ్యులఁగా స్వీకరింపరాదు. ఏగ్రామసింహాసంఘమునందును వారికి స్థాన మొసఁగవలదు; గ్రామసింహములకు శౌచము లేకున్నను విశ్వాసాది సద్గుణములయినను గొన్ని యున్నవి; మన నాస్తికగ్రామణుల కవియు సున్న!

ముసల్మానులు దేశమును బాలించునపుడు హిందూరాజులకుఁ గొందఱు ముసల్మానులే రాయబారులుగాను ముసల్మాను ప్రభువులకు హిందువులే కొందఱు రాయబారులుగాను నుండుచువచ్చిరి కాని

యెవరి మతమర్యాదలను వారు మీఱకుండుటయే కాక తమప్రభువుల మతమును వ్యవహారమను వ్యాజమున మార్చుటకుఁ బ్రయత్నించి యుండలేదు. ఏపనికై తాము పంపఁబడిరో యాపనియందే దృష్టిని నిల్పి స్వామిభక్తిచే ధన్యులగుచుండెడివారు. నానాసాహేబనఁబడు మహారాష్ట్రరాజునకు రాజ్యభ్రంశము కలుగఁగా ముసల్మానుఁ డొకఁ డాంగ్లదేశమున కేఁగి యచట నాంగ్లమంత్రివర్గముకడ మహారాష్ట్ర సామ్రాజ్యవిషయమునఁ గృషిసల్పెను. అటులనే మహమ్మదీయుఁడగు ఢిల్లీ చక్రవర్తి యాంగ్లేయులవలని బాధకుఁ దాళఁజాలక రామమోహన రాయలను హిందువును గోరఁగా నతఁ డాంగ్లదేశమునకుఁ జని యచ్చటఁ బరిపాలకులయొద్దఁ దన చక్రవర్తియొక్క యధికారమును గూర్చి వాదించివచ్చెను. మహమ్మదీయుఁడు హిందువునిమతమును విపరీతముగాఁ బ్రదర్శించుటకుఁ బ్రయత్నించియుండలేదు; హిందువుఁడును మహమ్మదీయునిమతమును వ్యతిరేకముగా బోధించుటకు సిద్ధపడలేదు. ప్రకృతమున మన జాతీయనాయకు లట్లుకాదు. వారు రాజకీయవిషయములతో సంతుష్టిఁజెందియుండక మన మతమునుగూడ మార్చుటకు సంకల్పించి మతసిద్ధాంత మొక్కటియైన నయ్యది వేఱొకటియని ప్రకటించి మోసమొనరించుచున్నారు. ఔరంగజీబు మొదలయిన ముసల్మానుల కొలువున సేనలతోఁ బోవుచున్న హిందూనాయకులుకూడఁ బ్రాతఃకాలమయినతోడనే యేనదియొడ్డుననో గుఱ్ఱముదిగి స్నానసంధ్యాద్యనుష్ఠానము లొనరించుకొని, పిమ్మట గుఱ్ఱమునెక్కి పయనమై పోవుచుండెడివారు. మార్గమున దేవళ మొక్కటి కానవచ్చినప్పుడు దేవతాదర్శనముఁ గావించి కానుకలర్పించి ప్రయాణము సాగించువారు. మన యభినవ నాయకులన్ననో దేవాలయములందలి యఖండదీపము లార్పి యాజ్యముఁ ద్రావి నగలను నాణెములను సంగ్రహించి విగ్రహముల నపవిత్రీకరించి, విహరించువారు. ఇట్టి

వారిని శాసనసభాదులకుఁ బంపుటకంటెఁ దెలివిమాలినపని మఱి యొకటి యుండదు. కాఁబట్టి యాస్తికు లెవ్వరును జాతీయసభాధి కారులు పన్ను మాయలకుఁ జిక్కక, తత్సంబంధము లేని సజ్జనులకు మాత్రమే తమసంమతి పత్రముల (వోట్లను) నిచ్చి కృతార్థు లగుదురుగాక.

జాతీయసభాధికారులు మతముపై నెట్టిధమున దండెత్తు చున్నారని కొంద ఱడుగవచ్చును. కొన్ని నిదర్శనములను శ్రీమదభి నవ సరస్వతియందుఁ గొంతకాలమునకుఁ బూర్వముఁ జూపియే యుంటిని. ఇప్పుడు మఱికొన్ని ప్రదర్శింపఁబడుచున్నవి.

కాకాసురనగరమున (కాకినాడయందు) జాతీయ మహాసభను నిర్వహించుటకై యేర్పడిన యాహ్వానసంఘము (రిసెప్షనుకమిటీ) కూడినప్పుడు, వర్ణవిభేదము లేకుండ నన్నివర్ణములకు నొక్కచోట భోజనము జరుగవలెనని నాయకులు తీవ్రముగా వాదించియుండిరి. ఆహ్వానముఁ జేసినవారి కిది యుచితమా? ఒకవర్ణమునందలి పెద్ద లితరవర్ణముల జనులను వివాహాది శుభకార్యముల కాహ్వానించు నాచారము కలదు; కాని, వా రెవరివర్ణమునకుఁ దగినట్లు వారి కేర్పాటులను గావించి యెవరిడెందములకు నొప్పికలుగకుండ, నెవరి మతాభినివేశములకు విరోధము సంభవించకుండ, నందఱను గౌర వించి పంపి తాము గౌరవము నొందువారుగాని మన యభినవ నాయకులభంగి నియ్యదియే సమయమని భావించి తమ మతాభిప్రా యములను వచ్చినవారిపై బలాత్కారముగా నెక్కించుటకుఁ బ్రయ త్నించువారు కారు. కావుననే వార లద్భుతములయిన కార్యములను రాజకీయ రంగమునం దొనరింపఁగల్గిరి; మన యభినవనాయకులన్ననో పిచ్చిపను లొనరించి యున్న యైకమత్యమునుగూడఁ బాడుచేయు

చున్నారు. శివాజీమహారాజు హైదరాబాదునగరమున కేతెంచినపుడు నవాబుగారి మంత్రివర్యులయిన యక్కన్న, మాదన్న, యనువారి యింట విందొనరింపఁబడినది. వారితల్లిగారే వంటను సిద్ధముచేసిన వారు. వడ్డించునపు డీ బ్రాహ్మణమంత్రులు శివాజీమహారాజునకు సమీపమునఁ గూర్చుండి, తాము భోజనము చేయకపోయినను, బద్ధార్థము లందునట్లొనరించి మహారాజున కానందమును గూర్చిరి. ఏకపంక్తిని భుజింపవలెనని శివాజీ పట్టుఁబట్టియుండలేదు. నవాబుగారును బంక్తిభోజనము కావలెనని నిర్బంధముఁ గావించియుండలేదు; శివాజీ పంక్తికిరానియెడలఁ దనకును శివాజీకిని సంధి కలుగనేరదని నవాబుగారు వక్కాణించియుండలేదు. ఆ మహారాష్ట్రవీరుని మతాభిప్రాయములకు హానికలుగనివిధమున నతనికి సంమానమొనరించి నవాబుగారికి శివాజీతోదృఢసఖ్యమును ఘటింపఁజేసిరి. రాజనీతి యనఁగా, నిట్టిది. అట్టివా రెప్పటికిని ధన్యులు. ఈ కథను నాస్తికులలో నొక్కరగు జాదునాదుసర్కారుగారు తమ శివాజీచరిత్రమునందుఁ దెల్పియున్నారు. అభినవరాజనీతికోవిదులు క్రొత్తమార్గములను,ద్రొక్కువారు. అయినను గాకాసురనగరమున నెటులనో వర్ణభేదమునుబట్టి భోజనశాలలు నిర్మింపఁబడినవనియుఁ దమకు మతద్వేషము లేదనియు నాభాసఁగల్పించి, వీరు తమ కిష్టమయినట్లు వ్యవహారమందు వర్ణము లన్నియు నేకమై భుజించున ట్లొనరించిరని ప్రత్యక్షముగా నేత న్మహోత్సవముఁ దిలకించినవారికిఁ దెల్లమై యుండెను. వర్ణ వ్యవస్థాభాసకు నిర్మితమయిన విభాజకసామగ్రి యంతయుఁ గడపటి రాతిరిఁ బీకివేయఁబడెను, హిందూ నాయకాగ్రేసరులు పంక్తులు సాగించి మహమ్మదాలీ మొదలయిన సకలవర్ణములవారి ప్రక్కను నేత్రానందముగా విందు నారగించినవారయిరి. అంతియె కాదు. ఇంత ఘనకార్య మొనరింపఁ గల్గితిమని గర్వముతోఁ బత్రికలందు వ్రాయఁ

దొడంగిరి. ఇట్టివారికా, సనాతనమతాభిమానులు తమ సంమతిపత్రములు (వోట్లు) నర్పించుట?

మఱియు, హిందువులు పిండములనర్పించి పితృదేవతలఁ దృప్తి పఱచు నాచారము శతాబ్దములనుండి యేదేవాలయమునఁ గలదో, యితర ప్రదేశములం దున్నవారుకూడ నేపవిత్రస్థలమును స్మరించి "గయాయాం దత్తమస్తు" అని సంకల్పించుచున్నారో, యట్టి బుద్ధగయయందలియాలయమును బౌద్ధులవశ మొనరించుటకు మనజాతీయ నాయకులు విశ్వప్రయత్నముఁ జేయుచున్నారు. ఫిబ్రవరి 5,1923సం॥ నఁ బ్రచురింపఁబడిన యొకపత్రికయం దిటుల వ్రాయఁబడియున్నది:—

"Resolved that Babu Rajendra Prasad be authorised to investigate the proposal of placing the custody of Buddha Gaya Temple in Buddhist hands and to make a report to this Committee. Babu Rajendra Prasad is empowered to accept suitable persons in investigations." (ఇది కార్యనిర్వాహకవర్గమునఁ జేయఁబడినతీర్పు)

బుద్ధుని భగవంతునిగా భావించి యారాధించుచున్న హిందువుల హస్తములనుండి యీదేవళమును, భగవంతుఁడే లేఁడను బౌద్ధుల కొసంగుట న్యాయమా? శతాబ్దములనుండి యిది హిందువుల పాలనమున లేదా? జాతీయసభాధికారుల కిట్టివిషయములను విమర్శించుట కేమి యధికారమున్నది? వీరు నాస్తికులుకావున వీరి కేదేవాలయము మక్కఱలేదు. ఆస్తికులయిన వారి కిది మిక్కిలి ముఖ్యము. ఇందు నిమిత్తమే రాజపుత్రస్థానమునందలి వీరులు పెక్కుసారులు మహమ్మదీయులపై దండెత్తి గయాక్షేత్రమును దిరిగి హిందువులు సంపాదించుటనట్లు పాటుపడియుండిరి. వారి తరువాతివారయిన నిప్పటిహిందువు లింత దౌర్భాగ్యులని యెఱింగియుండినచో, రాజపుత్రవీరులు తమ

యమూల్యరక్తము నట్లు వ్యర్థముగా ధారపోసి యుండరు! ప్రకృత మున మన జాతీయనాయకుల దౌర్జన్యమువలన గయ మతాంతరుల వశముకాకుండ సనాతనమతస్థులు జాతీయసభాధికారులతోఁ బోరు సలుప వలసియున్నది. కాన్పూరునందు జాతీయమహాసభ జరిగినపుడు నాయకులు కొంత భయమొంది పూర్తిగా బౌద్ధుల కిచ్చుటకు సాహ సింపక, సమసంఖ్యగల హిందువులకును బౌద్ధులకును దేవాలయము నొసంగవలెనని నిర్ణయించిరి. ఆ హిందువులైనను, నెట్టి హిందువులు? గాంధివంటి హిందువులు! రాజేంద్రప్రసాదువంటి హిందువులు! రాజ గోపాలాచారివంటి హిందువులు! ఒకనిగృహమును వానినుండి యప హరించి, హిందూనామధారులయిన కొందఱకును బౌద్ధబ్రువులయిన కొందఱకును దాని నర్పించునెడల, న్యాయము కలిగినదని యెవ్వఁ డయినఁ జెప్పఁగలఁడా? గౌహాడియందు మొన్న జరిగిన జాతీయమహా సభయందీ యుభయమతస్థులకును దేవాలయము నర్పింపవలెనను నిశ్చయము శీఘ్రముగాఁ గార్యరూపమొందున ట్లొనరించుటకై సం నాహము కావింపఁబడెను. విలోకింపుఁడు, జాతీయమహాసభ నిరం కుశముగా నెట్టి ఘోరకార్యముల కొడిగట్టుచున్నదో! సంమతిపత్రముల (వోట్లను) నిట్టివారికిచ్చుట కేయాస్తికునికిఁ జేయివచ్చును?

అదియునుంగాక. కేరళదేశమున (తిరువాన్కూరుసంస్థానమున) వైకమనఁబడు నొక దివ్యస్థలము వెలయుచున్నది. దానికి సంబంధిం చిన వీధులయందెన్నఁడును బంచములు సంచరించు నాచారములేదు. అయినను మన జాతీయనాయకులు తంత్రముఁబన్ని యాదేవళముపై దండెత్తిరి. గాంధి, రాజగోపాలాచారి, శ్రీనివాసయ్యంగారు, మొద లయిన జాతీయనాయకులు బహువిధముల నీదివ్యస్థలమును ముట్ట డించిరి; ముట్టడించు వారికినిఁ బ్రోత్సాహ మొసంగిరి. అప్పటి మహా రాజు కొంత ధర్మబుద్ధిగలవాఁడుగావున వీరి యసత్యసత్యాగ్రహ

మునకు భయపడక యావరణలోఁ బ్రవేశించుచున్న నాస్తికుల నావలికి గంటివేయించి తాను జీవించువఱకు ధర్మమును గాపాడి ధన్యుఁడయ్యెను. కాని, యావరించుచున్న కలియొక్క కాలమేఘమును గండ్లతోఁ జూడఁజాలక కాఁబోలు నేతన్మహారాజు స్వల్పకాలముననే దివంగతుఁడయ్యెను. గుంటూరుపురపాలక సంఘమువారు (మునిసిపాలిటీ) వైకముపై దండయాత్రకు సహాయముగా నూరు రూప్యముల నొసంగిరి. సేలమువారుకూడ నట్లొనరించిరని వినియున్నారము. మచిలీబందరువారు సానుభూతిని మాత్రము వెల్లడించుచు నొకతీర్పు నొనరించిరి. ఈవిధముగా జాతీయనాయకులచే నాక్రమింపఁబడిన పురపాలకసంఘములు, పురపాలకసంఘము లెందులకేర్పడినవో కొంచెమయినను విచారింపక, ప్రజలనుండి బాటలు మొదలయినవో నిర్మించి పోషించుటకై పోగుచేయఁబడిన ద్రవ్యమును మతదండయాత్రలకై వినియోగించుచుండ, నేయాస్తికుఁడు చూచి శాంతముగా నుండఁగలఁడు? ఎక్కడి వైకము, ఎక్కడి గుంటూరు? ఎక్కడి వైకము, ఎక్కడి మచిలీబందరు? దేవాలయ మెక్కడ, పురపాలక సంఘమెక్కడ? ఏమయిన సంబంధము గలదా? జాతీయనాయకుల వ్యవహారమింత యసంబద్ధముగా నున్నది. ఇప్పుడు హిందువుల యాలయములపైఁ బడుచున్నారు; మఱియొకదినమున మహమ్మదీయసోదరుల మసీదులపైఁ బడెదరు. కొంతకాలమునకు మన క్రైస్తవసోదరులయొక్కయు బ్రహ్మసమాజిక భ్రాతలయొక్కయు నాలయములను గొల్లకొట్టఁగలరు. కావున నన్నిమతస్థులును నిద్రను విడిచి యిట్టి దోపిడు లొనరించువారు దొరతనమువారి శాసనసభాదులందుఁ బ్రవేశింపకుండునట్లు ప్రయత్నముఁ జేయవలయును. లేకున్న నన్నిమతములును దుదకు సంద్రమునఁ బడి మునిఁగిపోవలసి వచ్చును.

మఱియు, బొంబాయినగరమునందలి పురపాలకసంఘమునకు (మునిసిపాలిటీకి) పటేలుగారు కొంతకాలముక్రింద నధ్యక్షులుగా నుండిరి. అప్పు డొకతీర్పును సభ్యుఁడొకఁడు తెచ్చెను. అన్నవిక్రయ శాలలందు జాతిభేదము లేకుండ నన్ని జాతులను రానీయవలయు ననియు నట్లు రానిచ్చుట కిష్టపడని యన్నవిక్రయశాలాధికారి తన వ్యాపారమును సాగించుట కర్హుఁడు కాఁడనియు దీని విషయము. ఇష్టమయిన వానికి భోజనమిడుటకును నిష్టములేనివానికి మానుటకును బ్రతిమానవునకు స్వాతంత్ర్యము లేదా ? భోజనమున వర్ణసంకరము శాస్త్రముచే నిషేధింపఁబడుచుండ దానిని, విధించుటకుఁ బురపాలక సంఘమునకేమియధికారముగలదు ? కాని మన పటేలుగారు గాని మఱి యేపాలేలుగారుగాని యిదియేమియని యచ్చరువొందువారు లేరు. తీర్పు త్రోసివేయఁబడలేదు; అది విమర్శకై పాకీసంఘమునకు (శానిటరీకమిటీకి) విడిచిపెట్టఁబడినది. ఓయాస్తికులారా, చూచితిరా మన యపూర్వధర్మపరిషత్తులను ?

ఇట్లు తిరుపతికి సమీపమునఁ గల తిరుచనూరు నందలి యాలయమునం దొకమాలవాఁడు ప్రవేశపెట్టఁ బడెను. ఆతఁడు శ్రీ పద్మావతీదేవికిఁ బూజసల్పి వెడలినతోడనే యాతనిజాతి తెలియఁ బడినందున నాతనిపై దొరతనమువారియెదుట నొక యభియోగము నాలయాధికారులు తెచ్చిరి. అబ్రాహ్మణుఁడైన న్యాయాధికారి వానిని శిక్షించెను. అప్పుడు పైనాస్తికులు పెద్దయధికారియొద్ద నీయభి యోగమును విమర్శకై పెట్టిరి. బ్రాహ్మణోత్తముఁడైన యాతఁడా మాలవానిని నిర్దోషియని విడిచిపెట్టెను. ఆన్యాయస్థానమునఁ జండా

లుని పక్షమున వాదించినవా రెవ్వరన జాతీయసభానాయకులగు రాజగోపాలాచార్యులయ్యవార్లంగారే! దొరతనమువారి న్యాయస్థానములను బహిష్కరింపవలెనని శాసించుచు నపరగాంధియని పేరు వడసిన వీ రేమొగముతో నచ్చటికేగిరో, వాదించిరో వారివిచిత్రకపాలమునకే విశదము కావలెను. కాని ఇతరులకుఁగాదు. దేవాలయము నపవిత్రీకరించు నుద్దేశ మాచండాలునకు లేదనియు, నందువలన శిక్షాశాసనముక్రింద నతనిచర్య రాదనియు మన బ్రాహ్మణ న్యాయవాదియొక్కయు, బ్రాహ్మణ న్యాయాధికారియొక్కయు వాదము. ఇతరులను నిరసించునుద్దేశము లేదని పల్కుచు గాంధిగారి యాశ్రమమున నొక్కఁడు బలాత్కారముగాఁ బ్రవేశించినచో నయ్యది సమ్మతమగునా? స్థిరమగు నుద్దేశము లేనప్పుడు శిక్ష తక్కువయై యుండుఁగాక; శిక్షయే లేదనుట యెట్లు? ఇట నిరసనోద్దేశము లేదనియు నెట్లు తెలియఁబడుచున్నది? మఱియు నపవిత్రత లేదేని సంప్రోక్షణ మేల విధింపఁబడినది? ఆకర్మకు వలయు ద్రవ్యము నెవ్వ రిచ్చెదరు?- అపవిత్రీకరించిన చండాలుఁడా? ఆతనిపక్షమున వాదించిన న్యాయవాదియా? ఆతనికిష్టముగాఁ దీర్పు చెప్పిన న్యాయాధికారియా?

రాజమహేంద్రవరమునందలి కోటిలింగక్షేత్రమునఁ గూడఁ బంచములు జాతీయనాయకుల ప్రోత్సాహమున దేవళమునందుఁ బ్రవేశింప సాహసించిరి.

అదియునుంగాక, దొరతనమువారు జాతినిర్బంధము లేకయే కొన్ని పాఠశాలలకుఁ బ్రతివత్సరమునఁ గొంతధనము నిచ్చుచుండఁగా మన జాతీయనాయకులు కొందఱు శాసనసభాదులందుఁ బ్రవేశిం

చియు, మంత్రిత్వాదికమును సంపాదించియు నొక మార్పును జేయఁ దొడంగిరి. ఏపాఠశాలయందు మాలవారికిఁ బ్రవేశము లేదో, యా పాఠశాలకు దొరతనమువా రెట్టిసహాయమును జేయరాదని వీరి నిష్కర్ష. దొరతనమువారిచే బహిష్కరింపఁబడుదును భయమున సనాతనమతస్థులు తమ పాఠశాలలందుఁ బంచములను స్వీకరింపఁ గలరనియెంచి నాస్తికనాయకు లీ యెత్తు నెత్తిరి. నాస్తికగణమునఁ జేరినదయ్యు నిర్బంధము న్యాయముకాదని యెఱింగి యానీబెసాంటు చండాలురకై ప్రత్యేకముగాఁ బాఠశాలలను నిర్మించుట మంచిదని వాక్రుచ్చెను.

చండాలురను రానీయని పాఠశాలలకు దొరతనమువారు సహాయమొనరింపఁ గూడదని జాతీయనాయకు లిప్పుడు శాసనము గావించుచున్నారు. ఇఁక మదవతులను స్వీకరింపని పాఠశాలలకు దొరతనము వారి ధనము ముట్టదని కొన్నాళ్ళకు నిర్ణయము కలుగ వచ్చును. అన్నివర్ణములును స్త్రీపురుషులును గలసి యొక్కపాఠశాల యందే విద్యాభ్యాసమొనరింపఁగోరిన వారికి దొరతనమువారు ద్రవ్య మొసంగుటయొకటి; అది యిష్టములేనివారిని బహిష్కరించుటయొకటి; సంకరాభినివేశముగలవారివిద్యను బోషించినను దదభినివేశములేని వారిని మాడ్చివేయఁ జూచుట ధర్మమా?

ఇట్లు జాతీయసభాసైనికులు సనాతనమతదుర్గమును బెక్కు తావుల ముట్టడించుచున్నారు. ఆస్తికులు నిద్రించినచో పరాజయము సిద్ధమగును. పరరాజు లెందఱువచ్చినను బూర్వము మనలోఁ గొందఱు మహానుభావులు వారియొద్ద పెద్దపదవులను సంపాదించి వైదికమత మునకుఁ గీడుకలుగకుండఁ గాపాడుచుండిరి గావున మనపూర్వులు జపాదు లనుష్ఠించుచు శాంతముగాఁ గాలక్షేపముఁ జేయుచుండినను

బాధకలుగలేదు. ఇప్పు డట్లుకాదు. నాస్తికాధములే లౌకికపదవులన్నియు నాక్రమించి మతధ్వంసముఁ గావించుచున్నారు. పండితులనఁబడువారుకూడ వారికే సాయమొనరించుచున్నారు. పండితు లుదాసీనులయి యున్నారు. ఇంతశోచనీయదశ మనదేశచరిత్రమున మఱియొకటి చూపట్టదు. కావున సమర్థులయిన యాస్తికులు నిద్రను విసర్జించి, యౌదాసీన్యమును వర్జించి, వైదికవైదుష్యమునకు లౌకిక ప్రజ్ఞను గలిపి, ధర్మమును రక్షింతురుగాక !

—• అశ్వత్థమహిమ. •—

సీ॥ అటు శ్రుతిస్మృత్యర్థహరులైన హైతుకు లోగిఁ బ్రపంచమున లేకుండనైరి
పాషండులెల్ల రబ్రముఁజెంది ముక్తిమార్గమువట్టి రాత్మమార్గముల వదలి.
తన్మూర్తిఁ మందరధరమునం బ్రమథాదిపరివృతం బదిమొద ల్ప్రస్తుతమును.
జగదుదయస్థితిసంహారకారిణి యఖిలబీజంబు ననంతకమును.
హరిహరాత్మకంబు నఖిలయోగిధ్యేయ. మనయ మర్చనీయ. మఘహరంబు
ముక్తిగోరు ప్రజయు సక్తిమై దాని ధ్యానించి పరమపదము గాంచఁగలదు. ౨౨౩
తే॥ ప్రాణికోటికి నాధారమౌ గుణము లతిక్రమించిన హరిహరదేవమూర్తిఁ
హరి పరుండంగ ధ్యానించినట్టివాఁడు నరుఁడుగాఁడిఁక వాఁడు నిర్జరుఁడెకాని.
క॥ మందరగిరికిఁ బోయిన యందఱ కిష్టంబు లొసఁగు హరిహరుఁ” డని యీ
చఁదమున ధాత తత్సురబృందముతో ననె యటనె యద్వృక్షుండగుచుఁ ౨౨౪
ఉ॥ మందరపర్వతంబున కమర్త్యులు వోయి యటన్ మహేశుఁ ద
త్సుందరి బిల్వభూమిరుహసుస్థితిఁ దత్తులసీద్రుమస్థయౌ
నిందిర నందఱున్ వెదకి యెల్లెడలన్ భ్రమియించి. రేమనన్.
ముందు ప్రపంచ మంతయును భూజమయంబచుమీ జఘన్యజా! ౨౨౫
శా॥ ఆవృక్షంబులు దేవతాంశములచే నావిర్భవంబంది యొం
తేవతిఁల్లెడి వానిఁ దాఁకియె జనం బేనశ్చయత్యక్తమౌ.
గోవిందుండు పరుండినప్పు మఱియున్ ఘోరాఘము ల్వాయు. న
ట్లావేల్పు ల్శివుఁగాన కద్రి మనుచో నాకాశవాకిట్లనెన్. ౨౨౬
ఆ॥ “ఈశ్వరుండు శౌరి యెల్లభూతంబులమీఁదికరుణఁ జెట్లమీఁదనుండు.
రందులోఁ గృపాళులౌచుఁ జాతుర్మాస్య వదలకుండనుంద్రు వానియందు. ౨౨౭
ఆ॥ అట్లుగాన సేవ్య మశ్వత్థవృక్షంబు మందవారమందు నుతియు సేవ్య.
మహరహంబుఁజేయు నశ్వత్థసంస్పర్శనమునఁ బాతకంబు నాశమొందు. ౨౨౮
ఆ॥ పాలు నూగుపిండి బాగుగాఁ గలిపి యశ్వత్థమూలమందు భక్తితోడ
పోయునట్టివాని పూర్వికుల్ తృప్తాస్మయనుదు. శౌర! తన్మహత్త్వమేమొ. ౨౩౦
సీ॥ గంధపుష్పాదులం గరమలంకృతమైన యశ్వత్థ మఘరోగహరము కరము
మానసంబున బిట్టు ధ్యానింపఁబడినట్టి యశ్వత్థ మఘరోగహరము కరము.
ఎంతయు భక్తిమై నీక్షింపఁగంబడ్డ యశ్వత్థ మఘరోగహరము కరము.
సేచనాదులచేత సేవ్యమానంబగు నశ్వత్థ మఘరోగహరము కరము.

తవిలి యనినట్టి వినినట్టి దాని పేరె యగ్గలము జ్ఞానదము పాపహారము కరము.
హరిపరుండినయట్టి యపుడైన మఱియువరము. ఇంతకంటెను వాక్రువ్వ నేరతరము

సీ॥ అగ్గలంబగుభక్తి నర్ఘ్యపాద్యాదులం బూజ్యమానంబౌచుఁ బొల్పునదియు
పాదునం దెల్లప్డుఁ బరిపూర్ణమైయుండు కీలాలముల ముద్గితేలునదియు
అఖిలామయంబుల హరియించుచుం బ్రాణివిసరంబునకు సౌఖ్యమొసఁగునదియు
నీచనాదులఁ దన్ను సేవించుజనముల కలుషంబులన్నింటిఁ దొలఁచునదియు
నైన రావిమ్రాను నభిధానమేనియు నోట నుచ్చరింప నోచువారి
కమరవర్యులార! యమలోకభయము ముండ. దింతకన్నఁజెప్ప నేమిగలదు. ౨౩౨

తే॥ కుంకుమమునను మలయజపంకమునను రావిమ్రానికిఁబూసి యర్చనము సేయు
నట్టివానికిఁ దాపత్రయంబు తొలఁగుఁ గలుగు వైకుంఠపురమున గణతగూడ. ౨౩౩

శ్లో॥ దుస్స్వప్నం దుష్టచింతాంచ దుష్టజ్వరపరాభవాన్
విలయం నయ పాపాని పిప్పల త్వం హరిప్రియ॥ ౨౩౪

క॥ అను నీమంత్రముచే నేజను లశ్వత్థంబుఁబూజ సల్పెదరో వా
రను నెల్లపనులు సేయుచు ననుకూలుండగుచునుండు యముఁ డనయంబున్. ౨౩౫

క॥ చాతుర్మాస్యంబునహరి ప్రీతిమెయిం బిప్పలమునఁ బీఠంబిడి ధా
త్రీతలసంగతనూతన శీతాంభఃపాయినాఁగ సేవించుఁజుడీ. ౨౩౬

క॥ సలిలము హరి. సలిలతిచే నల హరియె మహారసంబు. నటుగావున మ్రాఁ
కులయం దెల్లపు డుండెడి జలజాక్షుఁడు కొలలఁదొలఁచుఁ జాతుర్మాస్యన్. ౨౩౭

తే॥ సకలభూతగతుండగు చక్రపాణి జగతి కాప్యాయనంబును సల్పుచుండు.
అట్టు లశ్వత్థగతుఁడైనహరి కెరంగువారు పడ రెన్నటికిఁగూడ నారకమున. ౨౩౮

క॥ రావిం బావితతనుఁడై యేవాఁ డిల నాటు వానియేనశ్చయముల్
వేవేలైనను గానీ యావెంటనె విలయమొందు నాశ్చర్యముగన్ ౨౩౯

క॥ రావి సమస్తాగమములఁ బావనము శుభప్రదంబుఁ బరికింపంగన్.
కైవల్యంబునొసంగెడి యావృక్షము రోపితంబు ధ్యాతము నగుచున్. ౨౪౦

ఆ॥ రావిఁగాలుపెట్టు కావలనరు బ్రహ్మహత్య సంఘటించు ననవసరము
గం గుదించునట్టి కలుషాత్ముకుండును నిరయమందుఁగూలు నిశ్చయముగ. ౨౪౧

సీ॥ అశ్వత్థమూలంబు నాశ్రయించివసించు విష్ణుదేవుఁడు సర్వవేళలందు.
అశ్వత్థతరుగుల్మ మండఁబాయకయుండు కేశవుండు రవిప్రకాశమునను.
అశ్వత్థశాఖలం దారూఢుఁడై మీఱు నారాయణుఁడుతా ననారతమును.
అశ్వత్థపత్రంబులందుఁ గూరుకుఁజెందు భగవానుఁడగుహరి పవ్వళించి.